ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

* కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రిక కు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను
* బాన్సువాడ టౌన్, కామారెడ్డి టౌన్, కామారెడ్డి ఆర్సి, బిచ్కుంద, బీర్కూర్, తాడ్వాయి, లింగంపేట, నస్రుల్లాబాద్, మండలాలకు రిపోర్టర్లు కావలెను
* కనీస విద్యార్హత ఉంటే సరిపోతుంది. మిగతా వివరాలకు ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

9666556646



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం


# నిజామాబాద్ కామారెడ్డి









- మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులే ప్రధానం
- ఆశావహుల్లో నెలకొన్న ఆందోళన
- అప్పుల కోసం వెతుకులాట

**నిజామాబాద్, ఫిబ్రవరి 2 (ప్రజాజ్యోతి):** మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులే ప్రధానం కానున్నాయి. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు ఖర్చు చేసే స్థాయి ఉందా లేదా అని బేరీజు వేసుకుంటూ అభ్యర్థులను ఎంపిక చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో పురపాలిక ఎన్నికలు పిరంగా మారాయి. జిల్లాలోని మున్సిపాలిటీల్లోని ఎన్నికలు జరుగుతుండగా.. డబ్బుల ప్రతిపాదికనే రాజకీయం నడుస్తోంది. కొన్నిచోట్ల ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు ఉన్నప్పట్టికీ సర్వేలో పనితీరు మెరుగ్గాలేదని పక్కకు పెడుతున్నట్లు తెలుస్తోంది. రిజర్వేషన్లు కలిసివచ్చినా కోరుకున్న వార్డుల్లో టికెట్ రాకపోవడంతో మరోచోట నుంచి పోటీకి దిగాల్సి వస్తోంది. దీంతో ఇన్నాళ్లు తాము కష్టపడిన చోట కాకుండా వేరేచోట పోటీచేస్తే ఓట్లు వస్తాయా,

# రాజకీయ ఆశలతో రక్తబంధం త్యాగం

డి-46 కెనాల్ బాలిక మృతి కేసులో తండ్రే హంతకుడు.

వివరాలు వెల్లడించిన సీపీ సాయి చైతన్య.



# నియోజకవర్గంలో ఒక్కటైన నేతలు

బీఫాంలు అందజేసిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ



# పుర పోరు పిరం

రావా అనే తర్జనభర్జన పడుతున్నారు.

ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు..
మున్సిపాలిటీల్లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తి కావడంతో బీఫాం కోసం అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. కొన్ని పార్టీలను అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించినా మరికొన్ని పార్టీలు ఇంకా పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించలేదు. బీఫాం ఇవ్వకపోయినా స్వతంత్రంగా అయిన పోటీ చేసేందుకు సైతం అభ్యర్థులు సన్నద్ధం అవుతున్నారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియనుండ డంతో పాటు ఎన్నికల గుర్తులు సైతం అభ్యర్థులకు కేటాయించనుంది. ఇక ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులు ఖర్చులకు సైతం ఎలా డబ్బులు కూడబెట్టాలో వాటి ప్రయత్నంలో ఉన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఒక్కో అభ్యర్థికి 10 లక్షల రూపాయల నుంచి 15 లక్షల రూపాయల వరకు ఖర్చవుతుందని అంచనాలు వేసుకుంటున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలంటే ప్రత్యర్థుల కంటే ఎక్కువ ఖర్చు పెట్టాలని అభ్యర్థులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో ఖర్చుల కోసం ఇప్పటికే పలువురు అభ్యర్థులు అప్పులు తీసుకురావడం, బంగారం బ్యాంకులో తాకట్టు పెట్టడం, భూములు, ప్లాట్లులు విక్రయించేందుకు వెనకడటంలేదని తెలుస్తోంది.

## రాజకీయ ఆశలతో
# రక్తబంధం త్యాగం

**బోధన్ ఫిబ్రవరి 02 (ప్రజాజ్యోతి):**

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని ఏఆర్పీ క్యాంప్ గ్రామ శివారులో ఉన్న నిజాం సాగర్ డి--46 కెనాల్‌లో గుర్తుతెలియని బాలిక మృతదేహం లభ్యమైన ఘటనలో పోలీసులు సంచలన విషయాలను వెలుగులోకి తీసుకొచ్చారు. గురువారం ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపగా, శుక్రవారం పోలీసుల దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది.

పోలీసులు మృత బాలిక ఆచూకీని నిర్ధారించగా, ఆమె మహారాష్ట్ర రాష్ట్రం నాందేడ్ జిల్లా ముద్కేడ్ తాలూకా కేరూర్ గ్రామానికి చెందిన పాండురంగ బాబురావు, అంకిత దంపతుల కూతురు ప్రాచీ (6) గా గుర్తించినట్లు వెల్లడించారు.
ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు బాలిక తండ్రి పాండురంగ బాబురావును అదుపులోకి తీసుకొని విచారించగా, తన కూతురు ప్రాచీని తానే కెనాల్‌లో పడేసి హత్య చేసినట్లు అంగీకరించినట్టు తెలిపారు. కన్న తండ్రే చిన్నారిని హత్య చేయడం పట్ల స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది.

వచ్చే సర్పంచ్ ఎన్నికలే కారణం...

పోలీసుల విచారణలో బయటపడిన అసలు నిజం మరింత సంచలనంగా మారింది. రానున్న గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలంటే ముగ్గురు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే అనర్హత నిబంధన ఉండటంతో, ఆ అడ్డంకిని తొలగించుకోవాలనే ఉద్దేశంతో పాండురంగ తన కూతురు ప్రాచీని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడి అయింది. ఈ అమానుషానికి ప్రస్తుత సర్పంచ్ గణేష్ ప్రేరేపించినట్లు ఆధారాలు లభించడంతో అతడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన వెనుక రాజకీయ ప్రేరణ ఉన్నట్లు స్పష్టమవడంతో కేసు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

సీపీ సాయి చైతన్య వివరాలు
ఈ ఘటనపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సోమవారం మీడియాతో మాట్లాడుతూ, చిన్నారి హత్యకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చట్టానికి ఎవరూ అతీతులు కారని స్పష్టం చేశారు.
బాలిక తల్లి అంకిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.
కన్న కూతురిని హత్య చేసిన ఈ అమానుష ఘటన సమాజాన్ని కలచివేస్తుండగా, చిన్నారి ప్రాచీకి న్యాయం జరుగుతుందా? నిందితులకు చట్టపరంగా కఠిన శిక్ష పడుతుందా? అన్న ప్రశ్నలు ఉత్కంఠగా మారాయి.
ఈ కేసును చేధించడంలో కృషి చేసిన బోధన్ సీఐ విజయ్ బాబు, ఎస్సై ముత్యాల రమ, ఎస్సై చంద్రమోహన్, కానిస్టేబుల్ సుధీర్ లను సిపి సాయి చైతన్య అభినందించారు.

# నియోజకవర్గం లో ఒక్కటైన నేతలు

కామారెడ్డి టౌన్ ఫిబ్రవరి 2 ప్రజా జ్యోతి

కామారెడ్డి నియోజకవర్గంలో మొన్నటి వరకు నిప్పు, ఉప్పుగా ఉన్న ఇద్దరు నాయకులు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఇద్దరు ఒకటయ్యారు, ఒకరు కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడు 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ జిల్లాలో సీనియర్ నాయకుడిగా రాష్ట్రంలో ఉన్నత స్థాయిలో ఉన్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, సార్వత్రిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయన సతీమణికి మున్సిపల్ చైర్మన్ పదవి ఇప్పించుకున్న గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, కొన్ని రోజుల తర్వాత ఇద్దరికీ పడకపోవడంతో గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ పై విమర్శలు చేశారు. తర్వాత నియోజకవర్గంలో అని మండలాల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు అందరూ షబ్బీర్ అలీ తోనే ఉంటామని అప్పట్లో తెలియజేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇద్దరూ ఒకటై కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి గ్రూపు రాజకీయాలు లేవని నేతలకు, పార్టీ కార్యకర్తలకు సంకేతం ఇచ్చారు. మరి ఇద్దరి కలయిక ఎన్ని రోజులు కొనసాగుతుందో చూడాలి. మున్సిపల్ ఎన్నికల వరకేనా? వేచి చూడాలి.?సమన్వయంతోనే గెలుపు సాధ్యం:కామారెడ్డి నియోజకవర్గంలో పార్టీ కేడర్ మధ్య పూర్తి సమన్వయం ఉందని, వర్గ పోరుకు తావులేకుండా అందరూ ఏకతాటిపైకి రావడం శుభపరిణామమని నేతలు పేర్కొన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో 'సమన్వయమే మంత్రం'గా
ముందుకు సాగి అన్ని వార్డుల్లో జయకేతనం ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మహేష్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మహమ్మద్ అజారుద్దీన్, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ , గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల బీ-ఫామ్‌లు అందజేశారు.

# సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ సిబ్బందికి ఘన సన్మానం చేసిన సిపి


## సమ్మక్క-సారక్క జాతరలో మానవీయత చాటిన పోలీసులు

**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 2 (ప్రజా జ్యోతి)**
మేడారం సమ్మక్క--సారక్క జాతర సందర్భంగా ఒక ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్, ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్పెక్టర్‌లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్., ఘనంగా అభినందించారు.
సిద్దిపేట జిల్లా గుండ్ల చెరువు గ్రామానికి చెందిన శైలేంద్ర సురేష్ అనే ప్రయాణికుడు తాడ్వాయి మండలం కాటాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆర్‌టీసీ బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో అకస్మాత్తుగా అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. ఈ ఘటనను గమనించిన అక్కడే విధులు నిర్వహిస్తున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన ట్రాఫిక్ ఎ.ఆర్. హెడ్ కానిస్టేబుల్ నెం.1051 శ్రీ జి. దస్తయ్య వెంటనే అప్రమత్తమై సీపీఆర్ (సి పి ఆర్) నిర్వహించి బాధితుడికి ప్రాణవాయువు అందించారు.
అనంతరం సమాచారం అందుకున్న ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎం. వినోద్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబులెన్స్‌కు వెంటనే మార్గం సుగమం చేస్తూ ట్రాఫిక్ రూట్‌ను క్లియర్ చేశారు. అంబులెన్స్‌ను హుటాహుటిన ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో బాధితుడి ప్రాణాలు నిలిచాయి. వీరు చూపిన సమయస్ఫూర్తి, మానవీయత ప్రశంసనీయమని అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా ధైర్యసాహసాలతో విధి నిర్వహణ చేస్తూ ఒక ప్రాణాన్ని రక్షించినందుకు ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ శ్రీ జి. దస్తయ్య మరియు ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎం. వినోద్ గార్లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పూల బొకే, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.
ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య మాట్లాడుతూ, ఇటువంటి మానవీయ చర్యలు పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచుతున్నాయని అన్నారు. ప్రతి పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ దస్తయ్య, రిజర్వ్ ఇన్స్పెక్టర్ వినోద్ గార్ల సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రశంసించారు.
ఈ సన్మాన కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి శ్రీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీ పి. ప్రసాద్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**మెండోరా ఫిబ్రవరి/ 02 (ప్రజా జ్యోతి)**
మెండోరా మండలంలోని పోచంపాడులో గల తెలంగాణ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్లో సోమవారం నాశముక్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుహాసిని మాట్లాడుతూవిద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడితే వారి భవిష్యత్తు అంధకారమవుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశ లోనే మంచి అలవాట్లు అలవరచుకోవాలని, మత్తు పదార్థాలు ఆరోగ్యంతో పాటు చదువుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.
డ్రగ్స్, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలు యువతను తప్పుదారి పట్టిస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు.
మత్తు పదార్థాల వినియోగం చట్టరీత్యా నేరమని, ఇలాంటి వాటికి దూరంగా ఉండడం ద్వారా మాత్రమే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఎస్సై స్పష్టం చేశారు. ఎటువంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా, ఎక్కడైనా ఇటువంటి కార్యక్రమాలు జరుగుతున్నాయంటే సమాచారం ఇస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీస్ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# తిమ్మకపల్లి అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన-అక్షరాభ్యాసం





**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 2 ప్రజా జ్యోతి**

కామారెడ్డి మండలం థీమ్మకపల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన అక్షరాభ్యాస కార్యక్రమం చిన్నారుల ఆరోగ్యం--విద్యాభివృద్ధే లక్ష్యంగా అవగాహన సదస్సు నిర్వహించిన సూపర్వైజర్ పద్మజ సర్పంచ్ లక్ష్మి పోషకాహారం, బాలామృతం, అంగన్వాడి సేవలపై తల్లిదండ్రులకు దిశానిర్దేశం కామారెడ్డి మండలం తిమ్మకపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని అన్నప్రాసన్న--అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల జీవితంలో తొలి అడుగుగా భావించే ఈ కార్యక్రమానికి గ్రామంలో విశేష స్పందన లభించింది.

ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ పద్మజ గ్రామ సర్పంచ్ లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అన్నప్రాసన్నం చేయించి అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, విద్యావంతుడిగా ఎదగాలన్నదే తమ లక్ష్యమని, అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను తల్లిదండ్రులు పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు.

డాక్టర్ ప్రతిభ మాట్లాడుతూ, పిల్లల జీవితంలో తొలి ఆరు సంవత్సరాలు అత్యంత కీలకమైనవని, ఈ దశలో సరైన పోషకాహారం అందిస్తే శారీరక, మానసిక, మేధస్సు వికాసం సమగ్రంగా జరుగుతుందని తెలిపారు. అనుబంధ పోషకాహారంగా అందిస్తున్న బాలామృతం తినిపించే సరైన విధానం, గుడ్లు తీసుకోవడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు.

హాయ్ ఆయుష్ వార్డు మెంబర్ లక్ష్మి మాట్లాడుతూ, గ్రామస్థులు అంగన్వాడి కేంద్రాలపై నమ్మకం ఉంచాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడి కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఆశ వర్కర్లు ప్రతిభ, జ్యోతి, లక్ష్మి, నరసవ్వలు మాట్లాడుతూ గర్భధారణ నుంచి బాల్యం వరకు అందించే సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

అంగన్వాడి సూపర్వైజర్ పద్మజ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ స్థాయిలో అన్ని పథకాలు సక్రమంగా అమలవుతున్నాయని, పిల్లల ఎత్తు--బరువు కొలతలు, ఆరోగ్య పరీక్షలు, పోషకాహార పంపిణీ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. అంగన్వాడి టీచర్లు, ఆయాలు తమ సేవల వివరాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, సుజాత అరుణ అంగన్వాడి ఆయాలు, వార్డు మెంబర్లు లక్ష్మి, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లిదండ్రుల్లో పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, విద్యపై అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# నేటి నుండి ఎల్లారెడ్డిలో 'సీఎం కప్-2026' క్రీడా వేడుకలు ప్రారంభం

**గాంధారి, ఫిబ్రవరి 2 (ప్రజాజ్యోతి)**

తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రెండో ఎడిషన్ 'సీఎం కప్-2026' క్రీడలు నేటి నుండి ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా సంబరాలు 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగనున్నాయని గాంధారి తహసీల్దార్ రేణుక చౌహన్ తెలిపారు.తహసీల్దార్ రేణుక చౌహన్ మాట్లాడుతూ, స్థానిక ప్రతిభను ప్రోత్సహించడం కోసం ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు, నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొననుందని తెలిపారు.నేటి ఉదయం 9:00 గంటలకు ఎల్లారెడ్డి జీవధాన్ పాఠశాల ప్రాంగణంలో క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై క్రీడలను ప్రారంభిస్తారు.ముఖ్య క్రీడలు జీవధాన్ పాఠశాలలో మరియు ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ప్రత్యేకంగా రామారెడ్డి మండల కేంద్రంలో నిర్వహించబడతాయి. ఫిబ్రవరి 5న, శివానగర్ మెయిన్ రోడ్ పక్కన ఉన్న మైదానంలో, ముగింపు వేడుకలు, బహుమతి ప్రధానోత్సవం నిర్వహించనుండగా, క్రీడా భిమానులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు.



ఈ పోటీల ద్వారా క్రీడాకారుల్లో ఉత్సాహం నింపడమే కాకుండా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యే అవకాశాల కోసం ఒక మంచి వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఎల్లారెడ్డి మండల విద్యాధికారి మరియు సీఎం కప్ కన్వీనర్ ఈ పోటీలను సమర్ధవంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లను పూర్తి చేశారు.

# వైభవంగా జగదాంబ దేవి-సేవాలాల్ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

**నాగిరెడ్డిపేట్,ఫిబ్రవరి02(ప్రజాజ్యోతి):**

నాగిరెడ్డిపేట్ మండలంలోని బేజ్జం చెరువు తండాలో జగదాంబదేవి,సేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవ వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పౌరాదేవి పీఠాధిపతి బాబుసింగ్ మహారాజ్,ఆల్ ఇండియా బంజారా శక్తిపీఠ్ పౌరదేవి జాతీయ ప్రధాన కార్యదర్శి బధ్యా నాయక్ లు హాజరై మహ 'భోగ్ బండార్' నిర్వహించి జగదాంబదేవి,సేవాలాల్ మహారాజ్ లకు నైవేద్యం సమర్పించారు.ఈ వార్షికోత్సవం మహోత్సవంను పురోహితులు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ,పుణ్యాహవచనం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు.ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.గ్రామంలోని మహిళలు,యువతులు,బంజారా వేషదారణ దుస్తులు ధరించి ప్రత్యేక హోమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా బాబుసింగ్ మహారాజ్ మాట్లాడుతూ జగదంబమాత సేవాలాల్ మహారాజ్ బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా తెలియజేశారని అన్నారు.జగదాంబ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో గిరిజన సమాజం అన్ని రంగాల్లో అబివృద్ధి చెందాలని ఆకాంక్షించారు అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో పూజారి కిషన్ నాయక్,ఆలయ కమిటీ సభ్యులు



బాబునాయక్,ఉపాధ్యక్షులు తులస్య నాయక్,గ్రామస్థులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక తనిఖీ ప్రజావేదికకు సర్పంచ్‌లు హాజరు కావాలి

## ఎంపిడిఓ రాజేశ్వర్

**గాంధారి, ఫిబ్రవరి 2 (ప్రజాజ్యోతి)**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) కింద గాంధారి మండలంలో 2024--25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 16వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని అన్ని గ్రామ పంచాయతీల్లో విజయవంతంగా నిర్వహించారు.ఈ నేపథ్యంలో సామాజిక తనిఖీకి సంబంధించి ప్రజా వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 4న (బుధవారం) ఉదయం 9.30 గంటలకు గాంధారి మండల కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల ఎంపిడిఓ రాజేశ్వర్, ఏపీఓలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరై సహకరించాలని వారు కోరారు.

# ఆర్ బి ఎస్ కే గాంధారి టీం ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు




**గాంధారి, ఫిబ్రవరి 2 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండలం లోని గండి వేట్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలల్లో సోమవారం రోజు పిల్లల కంటి స్క్రీనింగ్ ప్రోగ్రామ్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ డాక్టర్ హరికిషన్ రావు పర్యవేక్షించారు.ఆర్బిఎస్కే గాంధారి టీమ్‌లో డాక్టర్ మొహమద్ ఇస్తియానాథ్ అలీ, ఎంఎల్ హెచ్ పి మహేశ్వరి, స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, ఉత్నూర్ పీహెచ్సీ సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే మండలం లోని గౌరారం జెడ్పిహెచ్ఎస్‌లో కూడా అదే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఫార్మసిస్ట్ ఎల్లేశం, ఏఎన్ఎం జయసుధ, సంగీత తదితరులు సహకరించారు.కంటి స్క్రీనింగ్‌లో మొత్తం 212 మంది విద్యార్థులను పరీక్షించగా, 9 మందికి కళ్లద్దాలు సూచించాల్సిన అవసరం గుర్తించబడింది. వీరిలో ఇద్దరిని సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగింది.డాక్టర్ హరికిషన్ రావు ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల కంటి ఆరోగ్యాన్ని మరింతగా పర్యవేక్షించగలమని తెలిపారు.

# ఇస్రోజీవాడిలో రైతు నేస్తం కార్యక్రమం

**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 2 ప్రజా జ్యోతి**

ఇస్రోజీవాడి రైతు వేదిక పరిధిలోని రైతుల కోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రేపు రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమం ఉదయం 10.00 గంటల నుండి 11.00 గంటల వరకు ఇస్రోజీవాడి రైతు వేదికలో జరుగనుంది.

ఈ కార్యక్రమంలో రైతులకు ఉపయోగపడే పలు ముఖ్య అంశాలపై నిపుణులచే అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా యూరియా సరైన వినియోగం, సహజ వ్యవసాయ సూత్రాలతో సమగ్ర వ్యవసాయం, యాసంగి వరి పంటలో పురుగులు మరియు తెగుళ్ల నివారణ, స్థిరమైన వ్యవసాయానికి నానో ఎరువుల వినియోగం, రైతు రిజిస్ట్రీ వివరాలపై వివరణ ఇవ్వనున్నారు.

అదేవిధంగా రైతులతో నిపుణుల పరస్పర చర్చ నిర్వహించి వారి సందేహాలకు సమాధానాలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవేంద్ర పాల్గొననున్నారు.

ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు

# పోచారం పాఠశాలకు డ్యూయల్ డెస్కుల వితరణ






నాగిరెడ్డిపేట్,ఫిబ్రవరి02(ప్రజాజ్యోతి):
మండలంలోని పోచారం ప్రాథమిక పాఠశాలకు బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో డ్యూయల్ దేస్కులు సోమవారం వితరణ చేసారు.బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ షేక్ చాంద్ పాషా ఆధ్వర్యంలో జోనల్ డైరెక్టర్ హుస్సేన్, ప్రాజెక్టు డైరెక్టర్ సలీం సమక్షంలో దాత రష్మీ అగర్వాల్ సుమారు రూ. లక్ష విలువ చేసే 20 డ్యూయల్ డెస్కులను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ సంస్థ తమ పాఠశాలకు 20 డ్యూయల్ డెస్కుల అందజేయడం చాలా ఆనందంగా ఉందని,వారికి ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాలకు 20 డ్యూయల్ డెస్కులు వితరణ చేసిన సందర్భంగ దాత రష్మీ అగర్వాల్‌తో పాటు బిగ్ హెల్ప్ ఫౌండేషన్ సభ్యులను గ్రామా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిరణ్,ఉపసర్పంచ్ లు సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,గ్రామస్థులు విద్యార్థులు పాల్గొన్నారు

# అంగన్వాడి చిన్నారులకు సామగ్రి పంపిణీ



రాజంపేట ఫిబ్రవరి 02 (ప్రజా జ్యోతి)
రాజంపేట మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో సోమవారం నూతనంగా ఎన్నికైన 9వ వార్డు సభ్యురాలు బొక్కలో పద్మ బాల్నర్స్ దంపతులు చిన్నారులకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలోని విద్యార్థులకు పలకలు, బల్పాలు, కుర్చీలు, చాపలు, అందజేశారు. చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వార్డు సభ్యురాలు బొక్కలో పద్మ బాల్నర్స్ తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సభ్య బేగం పాల్గొని, చిన్నారులకు సామగ్రి అందజేసిన వార్డు సభ్యురాలికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్థానికులు, తల్లిదండ్రులు కార్యక్రమాన్ని అభినందించారు.

# పీ.ఎం.శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో ఘనంగా విద్యార్థుల వీడ్కోలు సభ

## ఉత్సాహభరిత వాతావరణంలో మధుర జ్ఞాపకాల పంచుకోలు








నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 2 (ప్రజా జ్యోతి)
సిరికొండ మండల కేంద్రం:సిరికొండ మండల కేంద్రంలో గల పీ.ఎం.శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల ౚ కళాశాలలో విద్యార్థులకు వీడ్కోలు పలికే కార్యక్రమం సోమవారం అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. విద్యార్థుల విద్యా ప్రయాణంలో ఇది ఒక మధురమైన మైలురాయిగా నిలిచి, హాజరైన వారందరి హృదయాలను ఆకట్టుకుంది.

ఈ వీడ్కోలు సమావేశానికి గ్రామ సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. పీ.ఎం.శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల ౚ కళాశాలలో విద్యనభ్యసించడం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. ఇక్కడ పొందిన జ్ఞానం, అనుభవం విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, ఈ విద్యాసంస్థ విద్యార్థులను కేవలం పరీక్షలకే కాకుండా జీవిత సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతుందని తెలిపారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్ధారించుకుని కష్టపడి చదివితే తప్పక విజయాన్ని సాధిస్తారని హితవు పలికారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగంగా మాట్లాడారు.

ఉప సర్పంచ్ శోభన్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకు సాగితే తప్పక తాను అనుకున్న గమ్యాన్ని చేరుకుంటారని తెలిపారు. అందుకే విద్యార్థులందరూ స్పష్టమైన లక్ష్యాలతో జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ విద్యాభ్యాస అనుభవాలను పంచుకుంటూ, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, ప్రసంగాలు సభికులను అలరించాయి. ముఖ్యంగా విద్యార్థులు పంచుకున్న జ్ఞాపకాలు, భావోద్వేగ మాటలు అందరి మనసులను తాకాయి.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ గ్యామ శోభన్, వార్డు నెంబర్ సభ్యుడు మోహన్, యువ నాయకుడు రాము, ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# నాగిరెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా మేకల మాధవి



నాగిరెడ్డిపేట్,ఫిబ్రవరి02(ప్రజాజ్యోతి):
నాగిరెడ్డిపేట్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా మేకల మాధవి నియమితులయ్యారు.ఈ మేరకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశానుసారం సోమవారం నాగిరెడ్డిపేట్ నాగిరెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ నియామక పత్రాన్నీ అందజేశారు.ఈ సందర్భంగ మాధవి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దివిటీ కిష్టయ్య,వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి,సీనియర్ నాయకులు రాంచంద్ర రెడ్డి,మండల మైనారిటీ ప్రెసిడెంట్ ఇమాం,నాయకులు కిరణ్,శ్రీనివాస్,కృష్ణ,మహేష్ రెడ్డి,వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# ఎల్లారెడ్డి పల్లెలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన గ్రామ సర్పంచ్ సుజాత శేఖర్

ఇందల్వాయి ( ప్రజా జ్యోతి న్యూస్) ఫిబ్రవరి. 2
ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి పల్లె గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ఎంపీ ఓ రాజ్ కాంతారావు అనంతరం గ్రామ సర్పంచ్ సుజాత శేఖర్ మాట్లాడుతూ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామం మండలంలోని ఆదర్శ గ్రామంగా నిలబెడతామని గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ తెలిపారు. అభివృద్ధిలో భాగంగా ఇంటి పన్ను నల్లమిల్లి తదితర బకాయిలు, వసూళ్లపై ప్రత్యేక దృష్టి సాధించారు గ్రామంలో పెండింగ్లో ఉన్న పనులు బిల్లులు సకాలంలో చెల్లించేలా గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ పనుల కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత శేఖర్. పంచాయతీ సెక్రెటరీ సంధ్య. కారోబార్ శ్రీనివాస్ గ్రామ పెద్దలు వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు



# డిజిటల్ యాప్ ద్వారానే ఇసుక కొనుగోలు

**అక్రమ రవాణాపై కఠిన చర్యలు**

**ఇందల్వాయి. ఎమ్మార్వో కార్యాలయంలో ప్రభుత్వ అధికారులతో తహసిల్దార్ శాంత కుమారి సమీక్ష సమావేశం.**

**ఇందల్వాయి ఫిబ్రవరి, 2 (ప్రజా జ్యోతి)**

కలెక్టర్ ఆదేశాల మేరకు ఇందల్వాయి ఎమ్మార్వో కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ అధికారులతో ఇంచార్జ్ తహసిల్దార్ శాంత కుమారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అనంతరావు ఎంపిఓ. రాజ్ కాంత్ రావు సీనియర్ అసిస్టెంట్ కిషన్. ఎస్సై జి సందీప్ , జిపిఓలు, పంచాయతీ సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తహసిల్దార్ శాంత కుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ ఇసుకను తప్పనిసరిగా డిజిటల్ యాప్ లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారానే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వి.డి.సి సభ్యులు గానీ, ఇసుక దందా చేసేవారు గానీ యాప్ ద్వారానే ఇసుక రవాణా చేయాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రతి లబ్ధిదారుడికి 10 ట్రాక్టర్ల ఇసుకను యాప్ ద్వారానే ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా అందజేస్తామని తెలిపారు.

ఇసుక బుకింగ్ పూర్తిగా మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారానే చేయాలని, మధ్యవర్తులకు ఎలాంటి అవకాశం లేదన్నారు. బుకింగ్ చేసిన 24 గంటల్లో సరఫరా, జీపీఎస్ ట్రాకింగ్, న్యాయమైన ధర వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. స్మార్ట్ ఫోన్ లేని వారు గ్రామ పంచాయతీ సెక్రటరీ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.



అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల సమన్వయం తప్పనిసరి అని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ కలిసికట్టుగా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఏ గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలింపు జరిగినా జిపిఓలు, పంచాయతీ సెక్రటరీలు వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ, అక్రమంగా ఇసుక తరలించే వారు చాలాసార్లు రాత్రి వేళల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతారని హెచ్చరించారు. అలాంటి వాహనాలను ఎవరైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, కానీ వాహనాల ముందు వెళ్లి ఆపేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. అలా చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. సమాచారం అందితే పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.కార్యక్రమంలో జిపిఓలు, పంచాయతీ సెక్రటరీలు అడిగిన ప్రశ్నలకు తహసిల్దార్, ఎస్సై స్పష్టమైన సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో , ఏపీవో పోశెట్టి ఇరిగేషన్ ఏ ఈ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాక్విజ్ కాంపిటీషన్‌కు విద్యార్థులు ఎంపిక



**ఆర్మూర్. ఫిబ్రవరి 02(ప్రజాజ్యోతి)**

ఆర్మూర్, మున్సిపల్ మామిడి పల్లి లో గల సెయింట్ పాల్ హై స్కూల్ విద్యార్థులు జిల్లాలో జరిగే క్విజ్ కాంపిటీషన్ పోటీలో పాల్గొనడానికి ఎంపికయ్యారు.అని స్కూల్ యాజమాన్యం తెలిపారు.

## డిజిటల్ ఇసుక విధానంపై అవగాహన సదస్సు

**మెండోరా:ఫిబ్రవరి/02(ప్రజా జ్యోతి)**

మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం నాడు డిజిటల్ ఇసుక విధానం మరియు గ్రామ పాలనపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సమావేశంలో భాగంగా అధికారులు డిజిటల్ ఇసుక బుకింగ్ ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనలపై దిశానిర్దేశం చేశారు. ఇసుక సరఫరాలో ఎక్కడా అక్రమాలకు తావులేకుండా, డిజిటల్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని మండల తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.. గ్రామాల్లో ఇసుక అవసరాలను గుర్తించి, ప్రజలకు సులభంగా అందుబాటులోకి తెచ్చే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీవో లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఇసుక రవాణాలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై సుహాసిని తెలిపారు.డిజిటల్ విధానంలో తలెత్తుతున్న సాంకేతిక ఇబ్బందులను కార్యదర్శులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా సర్వర్ సమస్యలను పరిష్కరించి, సామాన్యులకు ఇబ్బంది కలగకుండా చూస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. ఎంపీడీవో లక్ష్మణ్, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎస్సై సుహాసిని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి: డల్లా సురేశ్ మహాజన్.

**బోధన్ ఫిబ్రవరి 02 (ప్రజాజ్యోతి)**

గంజాయి మాఫియా దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ కుమారి గాజుల సౌమ్య వీర మరణానికి ఎడపల్లి మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం వద్ద తెలంగాణ లోకల్ ఫోర్స్ (ం.ా.ఫ్రీ) ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. సౌమ్య చిత్రపటం ముందు క్రొవ్వుతులు వెలిగించి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ం.ా.ఫ్రీ వ్యవస్థాపక అధ్యక్షుడు డల్లా సురేశ్ మహాజన్ మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి మాఫియా ఆగడాలు రోజు రోజుకు హద్దులు దాటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్మగ్లింగ్ దుండగులను అడ్డుకునే క్రమంలో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. కానిస్టేబుల్ సౌమ్యను కారుతో తొక్కించి హత్య చేసిన తీరు ఆశ్చర్యకరంగా, అనుమానాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు.

ఘటన స్థలంలో ఉన్న సీఐ, పోలీసులు ఏం చర్యలు తీసుకున్నారనే విషయంపై యావత్తు సమాజం, ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయని తెలిపారు. ఇటీవలే కానిస్టేబుల్ ప్రమోద్ పాత నేరస్థుడి చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఘటన మరిచిపోకముందే మరో కానిస్టేబుల్ హత్యకు గురికావడం ద్వారా సంఘవిద్రోహ శక్తులు ఎంతగా పేట్రేగిపోయాయో అర్థమవుతోందన్నారు. గంజాయి, డ్రగ్స్ ఎంతటి ప్రమాదకరమో సౌమ్య మరణమే నిదర్శనమని అన్నారు. సౌమ్య మరణానికి కారణమైన డ్రగ్స్, గంజాయి మాఫియాను వెంటనే అరెస్టు చేసి, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ం.ా.ఫ్రీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. డ్రగ్స్ మాఫియా చేతిలో సౌమ్య మరణం ఒక విషాద సంఘటన మాత్రమే కాకుండా, సమాజానికి చేసిన హెచ్చరికగా భావించాల్సిన అవసరం ఉందన్నారు.



కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో నిజామాబాద్ జిల్లా సీపీ ఛాలెంజ్‌గా తీసుకుని నిందితులను మట్టుబెట్టిన విధంగానే, ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మరణానికి కారణమైన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ మాఫియాలో ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించవద్దని రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ అధికారులను ం.ా.ఫ్రీ తరఫున డిమాండ్ చేశారు. అదే సౌమ్యకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి గ్రామ వివేకానంద నూతన విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు శంకర్ చారి, పంచాయతీ వార్డు సభ్యులు సాయి చిరు, ఆస్లాం, మోహన్, ముస్తాకు, కట్టర్ శ్రీకాంత్, జాగృతి సభ్యుడు శ్రీధర్ గౌడ్, సూర్య, విద్యార్థినులు అఖిల, డల్లా సింధూజ, సాయి ప్రసన్న, ఐశ్వర్య, శివ, అజయ్ తదితర యువకులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ముగిసిన జానకంపేట్ శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు.

**చక్రతీర్థం, కుస్తీ పోటీలతో ఘనంగా ముగింపు.**

**బోధన్ ఫిబ్రవరి 02 (ప్రజాజ్యోతి)**

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని జానకంపేట్ గ్రామంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గత వారం రోజులుగా నిర్వహించిన జాతర బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవోపేతంగా ముగిశాయి.ఈ నెల 01 న రథోత్సవం ఘనంగా నిర్వహించగా, 02వ తేదీ సోమవారం చక్రతీర్థం, కుస్తీ పోటీలతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఉదయం వేకువజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు పవిత్ర అష్టముఖి కోనేరు (పుష్కరిణి)లో స్నానాలు ఆచరించి శ్రీలక్ష్మీ



నృసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కుస్తీ పోటీలు నిర్వహించగా, అవి ప్రతి ఒక్కరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.

గ్రామ గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కుస్తీ పోటీలను గ్రామ సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్ లు ప్రారంభించారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు సర్పంచ్, గ్రామ నాయకుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఇంతకుముందు గ్రామ సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్, గౌడ సంఘం నాయకులు గోవర్ధన్ గౌడ్, జయవర్ధన్ గౌడ్, తాళ్ల విజయ్ గౌడ్, గ్రామస్థులు ఉప్పు సంతోష్, మిద్దె నరేందర్, మిద్దె చిన్నయ్య, శేఖర్ రాజు, శాల పోతన్న తదితర గ్రామ పెద్దలు, గ్రామస్తులు గ్రామ ఆచారం ప్రకారం డప్పు వాయిద్యాలతో కాలినడకన ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.





# మహాశివరాత్రికి ముస్తాబవుతున్న శ్రీ లొంక రామలింగేశ్వర ఆలయం

## అడవుల మధ్య ఆధ్యాత్మిక మహాక్షేత్రంగా విరాజిల్లుతున్న పుణ్యధామం



దట్టమైన అడవిలో గల శ్రీలొంక రామలింగేశ్వర ఆలయం

**నిజామాబాద్ రూరల్: జనవరి, 29 (ప్రజా జ్యోతి)**
నిజామాబాద్ రూరల్ సిరికొండ మండల కేంద్రానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో, దట్టమైన అడవులు, కొండలు, లోయల మధ్య ప్రశాంత వాతావరణంలో వెలసిన శ్రీ లొంక రామలింగేశ్వర ఆలయం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక శోభను సంతరించుకుంటోంది.
ప్రతి సంవత్సరం భక్తుల కిటకిటలాడే ఈ పుణ్యక్షేత్రం, ఈ ఏడాది ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో జరిగే మహాశివరాత్రి జాతర -- కళ్యాణ మహోత్సవం కోసం భక్తులను ఆహ్వానించేలా ఆలయ ప్రాంగణం అంతా రంగురంగుల విద్యుత్ దీపాలు, కలర్ లైట్లతో అలంకరించబడుతోంది. రాత్రివేళ వెలుగులతో మెరిసిపోతున్న ఆలయం దూరం నుంచే దర్శనమిస్తూ భక్తుల మనసులను ఆకట్టుకుంటోంది.

**ద్వాపర యుగానికి సాక్ష్యంగా నిలిచిన ఆలయం**
పూర్వికుల కథనాల ప్రకారం, ద్వాపర యుగంలో శ్రీరాముడు, సీతమ్మ, లక్ష్మణుడు వనవాస సమయంలో ఈ ప్రాంతానికి వచ్చి రాత్రి వేళ ఇక్కడ బస చేశారని చెబుతారు. ఉదయం సమీపంలోని కోనేరులో స్నానం ఆచరించి, పూజ నిర్వహించేందుకు శివాలయం వెతికితే ఎక్కడా కనబడకపోవడంతో, శ్రీరాముడు స్వయంగా ఇసుకతో శివలింగాన్ని తయారు చేసి పూజలు నిర్వహించాడని భక్తుల విశ్వాసం.ఆ ఇసుక లింగమే కాలక్రమేణా స్వయంభూ రామలింగేశ్వర స్వామిగా భక్తుల పూజలు అందుకుంటూ నిలిచిందని స్థానికులు చెబుతారు. ఈ ఆలయం వేల సంవత్సరాల చరిత్రను తనలో దాచుకుని నేటికీ భక్తిశ్రద్ధలకు కేంద్రంగా నిలుస్తోంది.

**రాముని పాదముద్రలున్న కోనేరి**
ఆలయం సమీపంలోని పవిత్ర కోనేరి మరో విశేష ఆకర్షణ. ఈ కోనేరి ఒడ్డున ఇప్పటికీ రాముని పాదముద్రలు ఉన్నాయని భక్తులు విశ్వసిస్తారు. ఆ కోనేరిలో స్నానం చేయడం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక శాంతితో పాటు శారీరక ఆరోగ్యం లభిస్తుందనే నమ్మకం ఉంది.

**బోయవాణి బండ విష్ణు చక్ర అద్భుతం**
ఒకప్పుడు కోనేరిలో చేపలు పట్టేందుకు వచ్చిన బోయవాణి దేవుని శక్తితో శిలగా మారిపోయిందని స్థానిక కథనం. ఆ బండ పక్కనే కనిపించే విష్ణు చక్రం భక్తులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దేవతలు వచ్చి బోయవాణిని లేపుతారనే విశ్వాసంతో ఆ చక్రాన్ని అక్కడ ఉంచారని భక్తులు చెబుతుంటారు.



అల్లు బండ



తేనె పట్టు గల చెట్టు

**చెట్టుపై తెట్టెలు భయభక్తుల నమ్మకం**
ఆలయం వెనుక భాగంలో కోనేరి సమీపంలో ఉన్న చెట్టుపై గుంపులు గుంపులుగా తెట్టెలు కట్టుకుని నివసిస్తాయి. ఎవరైనా చెడు ఉద్దేశంతో ఆలయానికి వస్తే అవి దాడి చేస్తాయని, అందుకే తప్పు పనులు చేసిన వారు ఈ ఆలయానికి రావడానికి భయపడతారని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ సంఘటనలు ఆలయానికి మరింత ఆధ్యాత్మిక మర్మాన్ని చేకూర్చుతున్నాయి.

**అల్లుబండపై భక్తుల విశ్వాసం**
మందిరానికి ఎడమ వైపున ఉన్న అల్లుబండ మరో అద్భుత విశేషం. ఆ బండపై చేతి బ్రొటనవేలు ఒత్తి ఉంచినప్పుడు, బండ చుట్టూ తిరిగితే భక్తులు కోరుకున్న కోరిక నెరవేరుతుందని అనాదిగా వస్తున్న విశ్వాసం. తిరగకపోతే అనుకున్న పని నెరవేరదని భక్తులు నమ్ముతారు. ఈ విశ్వాసంతో రోజూ ఎంతో మంది భక్తులు అల్లుబండను పరీక్షించుకుంటూ దర్శనానికి వస్తుంటారు.

**మాఘ అమావాస్య ప్రత్యేక పూజలు**
ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య నాడు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహిస్తారు. ఆ రోజున కోనేరిలో స్నానం చేస్తే చర్మ రోగాలు, దీర్ఘకాలిక జబ్బులు నయమవుతాయని భక్తుల నమ్మకం. ఈ కారణంగా ఆ రోజున భక్తుల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంది.

**మహాశివరాత్రికి ప్రత్యేక బస్సు సౌకర్యం**
మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం నిజామాబాద్ ఆర్టీసీ డిపో నుంచి సిరికొండ -- లొంక వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం మరింత మెరుగైంది.


**వచ్చే భక్తులకు మూడు రోజులు అన్న సత్రం ఆలయ కమిటీ నిర్ణయం**



భక్తులు స్నానం చేసె కోనేరు



కోనేరులో శిలైవున్న బోయవాడు విష్ణు చక్రం



రాముని పాదముద్రలు

శ్రీలొంక రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల కొరకు ఆలయ అభివృద్ధి కమిటీ వారు నూతనంగా మూడు రోజులు అనగా 15 16 17 తేదీలలో వచ్చే కొరకు ఈ సంవత్సరం నుండి మూడు రోజులు అన్న సత్రం నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ వారు తెలిపారు.

**ఆలయ ప్రాంగణంలో భక్తుల కొరకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు**
జాతరకు వచ్చే భక్తుల కొరకు ఇబ్బందులు ఎదురు కావద్దని ఆలయ అభివృద్ధి కమిటీ వారు నీటి సౌకర్యం ఆహార సౌకర్యం కాల కృత్యాల కొరకు భక్తులు పండుకోవడానికి వాహనాలు నిలపడానికి దుకాణాలు క్రమ పద్ధతిలో ఉండడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ వారు తెలిపారు.

**మూడు రాష్ట్రాల నుంచి భక్తుల వెల్లువ**
తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఈ మహాశివరాత్రి జాతరకు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. అడవుల మధ్య ప్రకృతి సౌందర్యంతో పాటు పురాణ వైభవం, అపార భక్తిశ్రద్ధ కలిసిన ఈ ఆలయం మహాశివరాత్రి వేళ ఆధ్యాత్మిక మహాక్షేత్రంగా మారుతోంది.

**ప్రకృతి ఒడిలో పరమశివుడి సన్నిధి**
**అదే శ్రీ లొంక రామలింగేశ్వర ఆలయం.**
ఈ మహాశివరాత్రి వేళ భక్తులతో ఆలయం కిటకిటలాడుతూ భక్తి పరవశంలో మునిగిపోతోంది...

## వంద శాతం వసూళ్లు మా కర్తవ్యం

**ఎల్లారెడ్డిపల్లి సర్పంచ్ సుజాత శేఖర్**

ఇందల్వాయి ఫిబ్రవరి 2 ( ప్రజా జ్యోతి న్యూస్)
ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో మార్చి 31 నాటికి 100% ఇంటి పన్నులు, నీటి బకాయిలను వసూలు చేయడం లక్ష్యంగా నూతన పాలకవర్గం కృషి చేస్తుందని అందుకు అనుగుణంగా సోమవారం నుండి ప్రత్యేక వసూళ్ల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎల్లారెడ్డిపల్లి సర్పంచ్ మఠంల సుజాత శేఖర్ వెల్లడించారు, ఈ మేరకు ఆయన గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఉప సర్పంచ్ జిన్నా సౌజన్య తో పాటు పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సంధ్య తో పాటు ఎంపీ ఓ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ సుజాత శేఖర్ తెలిపారు, ప్రతి ఒక్కరు ఇంటి బకాయి చెల్లించడంతోపాటు గ్రంథాలయా రుసుము, నీటి పనులు సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు, మండలంలో ఎల్లారెడ్డిపల్లి గ్రామాన్ని ఉత్తమ గ్రామపంచాయతీ గా తీర్చిదిద్దడానికి శాయశక్తుల కృషి చేస్తామని నూతన సర్పంచ్ సుజాత శేఖర్ భరోసా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మఠంల నాగేష్, లక్కాకుల రాజేశ్వర్, శ్రీకాంత్, రమేష్, నితిన్, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు

